మన సమగ్ర
ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
శనివారం , సెప్టెంబర్, 19, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM

6 నెలల్లో ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక!

ఖైరతాబాద్: ఖైరతాబాద్ నియోజకవర్గానికి బై ఎలక్షన్ (ఉపఎన్నిక) అనివార్యం కానుంది. శాసనసభ్యుడు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పుపై తాను సుప్రీంకోర్టును ఆశ్రయించబోనంటూ ఆయన స్వయంగా ప్రకటించారు. దీంతో ఆరు నెలల్లోపు బై ఎలక్షన్? నిర్వహించనున్నారు.నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో హైకోర్టు తీర్పు కారణంగా దానంకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కోర్టు తీర్పు అనంతరం దానం నాగేందర్ ఈ పరిస్థితిని చాలా చాకచక్యంగా ఎదుర్కొన్నారు. ఖైరతాబాద్‌కు బై ఎలక్షన్ వస్తే తానే బరిలో ఉంటానంటూ చెప్పారు.2023లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్, 2024 మార్చిలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొన్నారు. అనంతరం సికింద్రాబాద్ లోక్?సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. హస్తం పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్? శాసనసభ్యులు స్పీకర్‌ను రెండేళ్ల క్రితమే కోరిన విషయం తెలిసిందే.ఎంపీగా పోటీ చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ బీ–ఫారం ఇచ్చినందువల్ల అనర్హత వేటు పడుతుందని దానం నాగేందర్ అనుకున్నారు. కోర్టు అనర్హత వేటు వేసినప్పటికీ అందుకు సిద్ధంగా ఉండాలన్న వ్యూహంతోనే ఆయన గుంభనంగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. ఖైరతాబాద్‌కు ఒకవేళ బై ఎలక్షన్ వస్తే దానం నాగేందర్ పోటీ చేస్తే ఆయన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడం ఇది పదోసారి అవుతుంది. దానంపై అనర్హత వేటు పడటంతో తెలంగాణ భవన్ వద్ద భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) నేతలు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. తమ పోరాటం ఫలించిందని, ఫిరాయింపులను ప్రోత్సహించిన కాంగ్రెస్ రాజకీయాలకు ఇది

చెంపపెట్టు అని ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి అన్నారు.దానం నాగేందర్‌పై అనర్హత వేటు ప్రజాస్వామ్య విజయమని బీజేపీ తెలంగాణ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఓటర్ల నమ్మకాన్ని కాదంటే తగిన ఫలితం ఎదురవుతుందని వివరించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కోసం చేసిన పోరాటం ఫలించింది అని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను స్పీకర్ కొట్టివేసిన విషయం తెలిందే. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించగా, దానంపై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. ఈ మేరకు దానంపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ వెలువరించిన తీర్పులను రద్దు చేస్తూ హైకోర్టు 91 పేజీల తీర్పు వెలువరించింది. స్పీకర్ తీర్పును రద్దు చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లను అనుమతించింది. 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది.

కార్బన్ ఉద్గారాలు భారత్ కంటే అభివృద్ధి చెందిన దేశాల్లోనే

6 రెట్లు ఎక్కువ

- **ఎన్‌జీటీ గ్లోబల్ గ్రీన్ మీట్ సదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీ**
- **అభివృద్ధి, స్థిరత్వం రెండూ సమాంతరంగా సాగాలని వ్యాఖ్య**
- **భారత్ స్థిరమైన అభివృద్ధి సాధిస్తోందని వెల్లడి**

న్యూఢిల్లీ : నేటి ఆధునిక వాతావరణ సవాళ్లకు పరిష్కారాలు అందించే దిశగా భారత్? కృషి చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రకృతి, పర్యావరణానికి సంబంధించిన అంశాలపై శతాబ్దాలుగా భారత్? ప్రపంచానికి మార్గనిర్దేశం చేసిందని ఆయన గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో తలసరి కార్బన్ ఉద్గారాలు భారత్ కంటే 6 రెట్లు ఎక్కువని పేర్కొన్నారు. శనివారం దిల్లీలో జరిగిన ఎన్?జీటీ గ్లోబల్ గ్రీన్ మీట్‌లో మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.'ది ఫ్యూచర్? ఆఫ్? ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్?' అంతర్జాతీయ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ ఎన్?జీటీ మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కర్బన ఉద్గారాల విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలను తరచుగా అన్యాయంగా నిందిస్తున్నారు. భారతదేశ తలసరి కర్బన ఉద్గారాలు ప్రపంచ సగటులో సగం కంటే తక్కువగా ఉన్నాయి" అని అన్నారు.

రోడ్ల విస్తరణకు ఇరిగేషన్ అధికారులు

ఎందుకు అడ్డం పడుతున్నారు

సంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 19 : అమీన్‌పూర్‌లో ఇరిగేషన్ అధికారులపై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్, ఖీూ పేరుతో రోడ్ల విస్తరణకు ఇరిగేషన్ అధికారులు ఎందుకు అడ్డం పడుతున్నారని ప్రశ్నించారు. చెరువుల్లో పెద్ద పెద్ద భవనాలు కడుతుంటే ఇరిగేషన్ అధికారులకు ఎందుకు కనిపించట్లేదని నిలదీశారు.కానీ.. అమీన్‌పూర్‌లో బంధంకొమ్ము చెరువు వద్ద 150 ఫీట్ల రోడ్డుకు మాత్రం ఎందుకు అనుమతి ఇవ్వరని ఎంపీ ప్రశ్నించారు. వారం రోజుల్లో బంధంకొమ్ము చెరువు వద్ద 150 ఫీట్ల రోడ్డుకి అనుమతి ఇవ్వకపోతే ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు హెచ్చరించారు.

రాష్ట్రపతి ఏడీసీగా మేజర్ నవ్య షెకావత్ నియామకం- తొలి మహిళా

ఆర్మీ అధికారిగా రికార్డు

న్యూఢిల్లీ : రాజస్థాన్‌కు ప్రాంతానికి చెందిన మేజర్ నవ్య షెకావత్ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. సికార్ జిల్లాలోని కెర్పురా గ్రామానికి చెందిన మేజర్ నవ్య రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఏడీసీగా నియామకమయ్యారు. దీంతో ఈ ఘనత సాధించిన మొదటి ఆర్మీ మహిళా అధికారిగా రికార్డు సృష్టించారు. దేశంలో రాష్ట్రపతికి ఏడీసీగా నియమితులైన రెండో మహిళా అధికారిగా నిలిచారు. 2025లో ఇండియన్ నేవీకి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ యశస్వి సోలంకి ఈ పదవిని చేపట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఆర్మీ నుంచి నవ్య షెకావత్ ఆ గౌరవాన్ని దక్కించుకున్నారు. జులై 2026లో ఈ నియామకం జరగ్గా, ప్రస్తుతం ఆమె రాష్ట్రపతి భవన్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు.మూడు తరాలు సైన్యంలోనే మేజర్ నవ్య షెకావత్‌ది పూర్తిగా సైనిక కుటుంబం. సికార్ జిల్లాలోని కేర్పురా అనే చిన్న గ్రామానికి చెందిన నవ్య కుటుంబం మూడు తరాల వారు సైన్యంలో పనిచేశారు. ఆమె తాత భన్వర్ సింగ్ షెకావత్ ఇండియన్ ఎయిర్‌ఫో

ర్స్‌లో వింగ్ కమాండర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆమె తండ్రి గ్రూప్ కెప్టెన్ కరణ్ సింగ్ షెకావత్ ప్రస్తుతం ఎయిర్‌ఫోర్స్‌లోనే ఉన్నత హోదాలో సేవలు అందిస్తున్నారు. మూడో తరమైన నవ్య ప్రస్తుతం ఆర్మీలో మేజర్‌గా పనిచేస్తున్నారు.సీడీఎస్ పరీక్ష ద్వారా సైన్యంలోకి ప్రవేశంనవ్య తన స్కూలు, కాలేజీ చదువులు పూర్తి చేసిన తర్వాత సైన్యంలో సేవలందించాలని అనుకున్నారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కఠినమైన యూపీఎస్సీ 'సీడీఎస్' పరీక్షను రాశారు. తొలి ప్రయత్నంలోనే ఆ పరీక్షలో మంచి మార్కులు సాధించారు. ఆ తర్వాత చెన్నైలోని ప్రతిష్ఠాత్మక 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ'లో శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత 2021వ సంవత్సరంలో ఆమెకు భారతీయ సైన్యంలోని 'ఆర్మీ సర్వీస్ కార్ప్స్' విభాగంలో అధికారిగా అవకాశం లభించింది. ఈ విభాగం సైన్యానికి కావాల్సిన ఆహారం, వస్తువులు, రవాణా, ఇతర ముఖ్యమైన సహాయాలను అందిస్తుంది. ఈ శాఖలో అంకితభావంతో పనిచేస్తూ కేవలం ఐదేళ్లలోనే మేజర్ స్థాయికి ఎదిగారు. ఇప్పుడు నేరుగా రాష్ట్రపతి భవన్ వరకు వెళ్లి దేశం దృష్టిని ఆకర్షించారు.రాష్ట్రపతి ఏడీసీ అంటే ఏమిటి? ఆ పోస్టు ఎందుకంత ప్రత్యేకం?చాలామందికి ఏడీసీ అంటే ఏమిటో తెలియదు. రాష్ట్రపతి అధికారికంగా పాల్గొనే పర్యటనలు, సమావేశాలు, పరేడ్‌లు, ముఖ్యమైన కార్యక్రమాల్లో రాష్ట్రపతికి సహాయకులుగా ఉండే ప్రత్యేక సైనిక అధికారులనే 'ఏడీసీ' అంటారు.

'బస్సు' తుస్సు.. 'మహాలక్ష్మి'కి ఎక్స్‌ప్రెస్

బస్సు సర్వీసుల కొరత

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో అమలు చేస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యంపై అధికారులు కోత విధిం చారు. హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు తగ్గించడంతో మహిళా ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క హనుమకొండ బస్‌స్టేషన్ నుంచే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లాలలోని ఇతర డిపోల్లో కూడా ఎక్స్‌ప్రెస్ తగ్గించినట్లు తెలుస్తోంది. వరంగల్ రీజనల్ పరిధిలో హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి నిజామాబాద్, హైదరాబాద్‌కు వెళ్లే రూట్లలో ప్రధానంగా ఎక్స్‌ప్రెస్ బస్సులను అధికారులు తగ్గించారు. హనుమకొండ బస్టాండ్ నుంచి ఖమ్మం, ఏటూరునాగారం, నిజామాబాద్, హైదరాబాద్ దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు ఎక్స్‌ప్రెస్ బస్సులను తగ్గించి సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులను అదనంగా



నడుపుతున్నారు. దీంతో హనుమకొండ నుంచి హైదరాబాద్, నిజామాబాద్ ఇతర రూట్లకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సులకోసం బస్టాండ్ ప్రాంగణంలో గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళా ప్రయాణికులు వాపోతున్నారు.

బీజేపీ న్యాయ పోరాటం వల్లే దానంపై

అనర్హత వేటు

హైదరాబాద్, సెప్టెంబర్ 19:
పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. (శనివారం) మీడియాతో మాట్లాడుతూ. కాంగ్రెస్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి, బీఆర్ఎస్‌లో కేసీఆర్.. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని విమర్శించారు. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను పార్టీలోకి చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చారని మండిపడ్డారు. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవి కొనసాగిస్తూనే కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేశారన్నారు. బీజేపీ న్యాయ పోరాటం వల్లే దానం నాగేందర్ అనర్హత వేటు పడిందంటూ వ్యాఖ్యానించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ భూదందా పార్టీలే అంటూ కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. 'దోచుకోవాలి, దాచుకోవాలి.. పది తరాలకు సరిపోయేంత సంపాదించుకోవాలి. దోచుకుంటున్న పోటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయి' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌పై అనేక అవినీతి



ఆరోపణలు చేసినా కూడా సీఎం రేవంత్ రెడ్డి చర్యలు మాత్రం తీసుకోవడం లేదని మండిపడ్డారు. మ్యాచ్ ఫిక్సింగ్‌తో రెండు పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయన్నారు. అనేక హామీలిచ్చి నెరవేర్చకపోగా ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే పరస్పరం దోపిడీ ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. దోపిడీ చేసిన వారిని ఫాంహౌస్‌లకే పరిమితం చేశారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారో రాహుల్ గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. దుర్మార్గపు రాజకీయ అవినీతిపరులను తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కేటీఆర్ ఫామ్‌హౌస్ వైపు బయలుదేరిన

కాంగ్రెస్ ఎంపీలు, కీలక నేతలు

రంగారెడ్డి జిల్లా : శంకరపల్లి మండలం జన్వాడలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సంబంధించినదిగా చెబుతున్న జన్వాడ ఫామ్‌హౌస్, ఆ పరిసర ప్రాంతాల్లోని భూముల కేటాయి ంపులపై నిజానిజాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కాంగ్రెస్ ఎంపీలు, ముఖ్య నాయ ుకులు ప్రజాభవన్ నుంచి అక్కడికి బయలుదేరారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావుల కుటుంబాలు నిబంధనలకు విరుద్ధంగా భూములను ఆక్రమించారనే ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ బృందం ఈ పర్యటనకు పిలుపునిచ్చింది.కాంగ్రెస్ నేతల పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు,

గొడవలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం ఫామ్‌హౌస్ పరిసరాల్లో ముందస్తుగా భారీగా బలగాలను మోహరించింది. మార్గమధ్యంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. మరోవైపు, జన్వాడ ఫామ్‌హౌస్ భూమి తన సొంత ఆస్తి అని, కేటీఆర్‌కు అందులో ఎటువంటి యజమాని హక్కులు లేవని, కేవలం లీజుకు మాత్రమే ఇచ్చానని యజమాని ప్రదీప్ రెడ్డి నిన్న స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

విద్యార్థుల చేత మొక్కలు నాటించి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

ప్రజావాణి -- కూసుమంచి, సెప్టెంబర్ 19:
కూసుమంచి మండలం పోచారం గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్--టీచర్స్ సమావేశం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు. పాఠశాలలో చదువుతున్న 34 మంది విద్యార్థులతో 34 మొక్కలను పాఠశాల ఆవరణలో నాటించారు. ఒక్కో విద్యార్థి ఒక్కో మొక్కను దత్తత తీసుకుని దాని సంరక్షణ బాధ్యతను చేపట్టేలా అవగాహన కల్పించారు.గ్రామ సర్పంచ్ సలవాడి గురుమూర్తి నర్సరీ నుంచి మొక్కలను పాఠశాలకు అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. నాగార్జున చారి, ఉపాధ్యాయులు డి. వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ప్రకృతి పట్ల బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మొక్కలను క్రమం తప్పకుండా సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు.

దాచారం గ్రామంలో గౌడ కులస్తులకు 600 ఈత మొక్కల పంపిణీ

పచ్చదనం పెంపుతో పాటు గౌడ కుటుంబాలకు ప్రయోజనం

బెజ్జంకి,సెప్టెంబర్ 19 (ప్రజావాణి)
సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని దాచారం గ్రామంలో గౌడ కులస్తులకు ఈత మొక్కలను సర్పంచ్ బైరా మానస రాజేందర్ అందజేశారు.అనంతరం ఎల్లమ్మ గుడి పరిసర ప్రాంతంలో సుమారు 600 ఈత మొక్కలను నాటించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు గౌడ కుటుంబాలకు భవిష్యత్తులో ఉపయోగపడేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దీటి బాలనర్సు, వార్డు సభ్యుడు గడగోని అశోక్, గౌడ సంఘం అధ్యక్షుడు బొడిగె సతీష్, ఉపాధ్యక్షుడు ఇల్లందుల బాలరాజు, గౌడ కులస్తులు, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వినాయక యూత్ ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ

-భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు,

పెద్దవంగర; ప్రజావాణి
మండలంలో వడ్డెకొత్తపల్లి శ్రీ వినాయక యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను యూత్ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ మండపం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అనంతరం భక్తులకు యూత్ సభ్యులు మరియు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని చాటుతున్నాయని పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు, డాక్టర్ కుమ్మరి రామ్మూర్తి,బారాజు ఉపేందర్, పాక అనిల్ కుమార్, తంగళ్ళపల్లి కిరణ్ చారి, కుమ్మనబోయిన సంపత్, సింగిటుపు రమేష్, కుమ్మరి లక్ష్మణ్, వెల్మ బీరన్న, కొమ్మనబోయిన వెంకన్న, తుప్పతూరి శోభన్ బాబు, ప్రశాంత్, రాము, రిషికేష్, వశీకర్, బన్నీ, రతన్, వర్షిత్ వీక్షిత్,ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన్నెంపల్లిలో ఉద్రిక్తత

నోటీసులు ఇవ్వకుండా పాత గ్రామపంచాయతీ కూల్చివేతకు అధికారుల యత్నం

అడ్డుకున్న సర్పంచ్ పాలకవర్గం.. పోలీసుల బందోబస్తు మధ్య కూల్చివేత

కరీంనగర్,సెప్టెంబర్ 19 (ప్రజావాణి) కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో పాత గ్రామపంచాయతీ భవనం కూల్చివేత సందర్భంగా శనివారం ఉద్రిక్తత నెలకొంది. నోటీసులు ఇవ్వకుండా భవనాన్ని కూల్చేందుకు అధికారులు రావడంతో సర్పంచ్ సునీతతో పాటు పాలకవర్గం అడ్డుకుంది.ప్రోటోకాల్ పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్ సునీత ఆరోపించారు. మరోవైపు కలెక్టర్ ఆదేశాల మేరకే భవనం కూల్చేందుకు వచ్చామని అధికారులు తెలిపారు. గతంలో పాత గ్రామపంచాయతీ భవనాన్ని కూల్చకుండా ఇతర గ్రామపంచాయతీ అవసరాలకు వినియోగించుకోవాలని తమకు సూచించారని పాలకవర్గ సభ్యులు తెలిపారు.ఈ క్రమంలో అధికారులు, పాలకవర్గం మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తిమ్మాపూర్ సర్కిల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కూల్చివేతను అడ్డుకున్న సర్పంచ్ భర్త పొన్నం అనిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.అదే సమయంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న పురుగుల మందు తాగి చనిపోతానని సర్పంచ్ పేర్కొనడంతో పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. అనంతరం పోలీసుల బందోబస్తు మధ్య అధికారులు పాత గ్రామపంచాయతీ భవనాన్ని కూల్చివేశారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో మతసామరస్యానికి మధుర సందేశం

- కులమతాలకు అతీతంగా మనమంతా ఒక్కటేనని చాటిన రేష్మ మీర్జా షాహీర్

ఓదెల, సెప్టెంబర్ 19:
కులమతాలకు అతీతంగా మానవత్వమే అత్యున్నత విలువ అని చాటుతూ వశిష్ఠ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, పోత్కపల్లిలో డ్రైవర్‌గా పనిచేస్తున్న రేష్మ మీర్జా షాహీర్ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పోత్కపల్లిలోని విఘ్నేశ్వరుని మండపాన్ని సందర్శించిన ఆయన భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని, అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు కేవలం ఒక కులానికి, ఒక మతానికి మాత్రమే పరిమితమైనవి కావని, ప్రతి పండుగ సమాజంలోని ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే గొప్ప అవకాశమని పేర్కొన్నారు. పండుగల అసలు ఉద్దేశం పరస్పర సంతోషాలను పంచుకోవడం, ఆప్యాయతను పెంపొందించడం, సోదరభావాన్ని బలపరచడం, మానవత్వాన్ని చాటిచెప్పడమేనని అన్నారు.కులాలు వేరు కావచ్చు.. మతాలు వేరు కావచ్చు.. ఆచారాలు,సంప్రదాయాలు వేరు కావచ్చు..కానీ మనుషులంతా ఒక్కటే. ఒకరి పండుగను మరొకరు గౌరవించుకోవడం, ఒకరి సంతోషంలో మరొకరు భాగస్వాములు కావడం మన సంస్కృతిలోని గొప్పతనం" అని ఆయన పేర్కొన్నారు.భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచిందని, వివిధ మతాలు, కులాలు, భాషలు, సంస్కృతులకు చెందిన ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించడం దేశం యొక్క గొప్ప ప్రత్యేకత అని అన్నారు. చిన్నచిన్న భేదాలను పక్కనపెట్టి మనుషుల మధ్య ప్రేమ,

ఆప్యాయత, సోదరభావం పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.విఘ్నేశ్వరుని మండపానికి వెళ్లి స్వామివారిని దర్శించుకోవడంతో పాటు అక్కడికి వచ్చిన భక్తులకు స్వయంగా ప్రసాదాలు పంపిణీ చేయడం ద్వారా రేష్మ మీర్జా షాహీర్ మతసామరస్యానికి ఒక చక్కటి సందేశాన్ని అందించారు. మతం కంటే మానవత్వం గొప్పదని, పండుగలు మనుషుల మధ్య ఉన్న అనుబంధాలను మరింత బలపరిచే వేదికలుగా మారాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మండపం వద్ద ఉన్న పలువురు భక్తులు రేష్మ మీర్జా షాహీర్‌ను అభినందించారు. కులమతాలకు అతీతంగా విఘ్నేశ్వరుని సన్నిధికి వచ్చి భక్తిభావంతో పూజల్లో పాల్గొనడం, అనంతరం ప్రసాదాలు అందరికీ పంచడం సమాజానికి మంచి సందేశాన్ని అందించిందని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు ప్రజల మధ్య పరస్పర విశ్వాసాన్ని పెంచడంతో పాటు సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.పండుగల సమయంలో ఒకరి పండుగలను మరొకరు గౌరవించుకోవడం, పరస్పరం శుభాకాంక్షలు తెలియ జేసుకోవడం, సంతోషాలను పంచుకోవడం ద్వారా సమాజంలో ఆత్మీయత పెరుగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. మత సామరస్యం, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టినప్పుడే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం మరింత బలపడుతాయని పేర్కొన్నారు.విఘ్నేశ్వరుని సన్నిధిలో భక్తిశ్రద్ధలతో అడుగుపెట్టి, అందరితో కలిసి పండుగ సంతోషాన్ని పంచుకున్న రేష్మ మీర్జా షాహీర్ చర్య "పండుగలు మన మధ్య గోడలు నిర్మించడానికి కాదు.. మనసులను కలపడానికి" అనే గొప్ప సందేశాన్ని చాటిచెప్పింది. కులమతాల పేరుతో మనుషుల మధ్య దూరాలు పెరగకుండా, మానవత్వం పేరుతో అందరూ ఒక్కటిగా నిలవాలనే ఆలోచనకు ఈ కార్యక్రమం చక్కటి నిదర్శనంగా నిలిచింది.సమాజంలో పరస్పర గౌరవం, విశ్వాసం, సోదరభావం పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని, ప్రతి పండుగ మతసామరస్యానికి, మానవత్వానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలవాలని స్థానికులు ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా పోత్కపల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటన పండుగల అసలైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ అందరి ప్రశంసలను అందుకుంది.

ఒక పాఠశాల వస్తే విద్య మాత్రమే కాదు... మౌలిక వసతులు, ఉపాధి, వ్యాపారాలు కూడా అభివృద్ధి

---ఇలాంటి అరుదైన అవకాశాన్ని భిక్కనూర్ గ్రామం కోల్పోయిందా?

భిక్కనూర్, సెప్టెంబర్ 18 (ప్రజావాణి):
ఒక గ్రామంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం జరిగితే దాని ప్రభావం కేవలం విద్యా రంగానికే పరిమితం కాదు. పాఠశాల చుట్టూ రహదారులు, రవాణా, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు స్థానికంగా చిన్నచిన్న వ్యాపారాలకు, సేవా రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

విద్యా కేంద్రంగా మారే అవకాశంఇంటిగ్రేటెడ్ పాఠశాలలో విద్యార్థులకు ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా సౌకర్యాలు తదితర వసతులు అందుబాటులోకి వస్తే గ్రామం చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు కూడా ప్రయోజనం కలగవచ్చు. దీంతో భిక్కనూర్ ఒక విద్యా కేంద్రంగా గుర్తింపు పొందే అవకాశం ఉండేది.

మౌలిక వసతుల అభివృద్ధికి ఊతంఉండలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రతిరోజూ రాకపోకలు సాగించే విద్యా సంస్థ ఏర్పడితే దానికి అనుగుణంగా రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సౌకర్యాలపై ప్రభుత్వ దృష్టి పెరగవచ్చు. దీంతో పాఠశాలకే కాకుండా పరిసర ప్రాంత ప్రజలకు కూడా మౌలిక వసతులు మెరుగుపడే అవకాశం ఉంటుంది. స్థానిక వ్యాపారాలకు కొత్త అవకాశాలు

పాఠశాల చుట్టూ పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫారాలు, ఫుడ్ సెంటర్లు, రవాణా, ఇతర విద్యా సేవలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. స్థానిక యువతకు వివిధ సేవా రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కూడా ఏర్పడవచ్చు.

భూముల విలువపైనా ప్రభావంపెద్ద విద్యా సంస్థలు ఏర్పడిన ప్రాంతాల్లో రహదారులు, రవాణా, ఇతర మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందితే పరిసర ప్రాంతాల్లో నివాస, వాణిజ్య కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంలో ఇది ఆ ప్రాంత అభివృద్ధిపై ప్రభావం చూపవచ్చు.విద్యార్థులకే కాదు...

మొత్తం గ్రామానికే ప్రయోజనంఒక మంచి విద్యా సంస్థ అంటే ఒక భవనం మాత్రమే కాదు. దాని చుట్టూ ఏర్పడే విద్యా వాతావరణం, రవాణా సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు, వ్యాపార కార్యకలాపాలు, మౌలిక వసతులు కలిసి గ్రామ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే అవకాశం ఉంటుంది.

ఇలాంటి అవకాశం భిక్కనూర్ గ్రామానికి వచ్చినప్పటికీ, పాఠశాల స్థలం విషయంలో మార్పులు చోటుచేసుకోవడంతో గ్రామం ఒక కీలక అభివృద్ధి అవకాశాన్ని కోల్పోయిందనే చర్చ స్థానికంగా మొదలైంది. అయితే పాఠశాల స్థల మార్పునకు సంబంధించిన పాలనా అంశాలు, నిర్ణయ ప్రక్రియ, భవిష్యత్ ప్రణాళికపై అధికారిక కారణాలు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.ఇంటిగ్రేటెడ్ పాఠశాల అంటే కేవలం విద్యార్థులకు తరగతి గదులు కాదు... ఒక గ్రామ భవిష్యత్తుకు పెట్టుబడి.అలాంటి సంస్థ భిక్కనూర్‌లోనే ఏర్పడి ఉంటే గ్రామానికి దీర్ఘకాలంలో కలిగే విద్యా, సామాజిక, క ప్రయోజనాలు ఏమిటన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గూడెం--బెజ్జంకి రహదారికి మరమ్మతులు

గుంతలమయమైన రోడ్డుపై మొరం పోయించిన సర్పంచ్

బెజ్జంకి, సెప్టెంబర్ 19 (ప్రజావాణి)
సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గూడెం నుంచి బెజ్జంకి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రహదారిపై శనివారం మొరం పోయించి మరమ్మతు పనులు చేపట్టారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్ సూచన

మేరకు ఈ పనులు చేపట్టినట్లు గూడెం సర్పంచ్, సర్పంచ్ల ఫోరం బెజ్జంకి మండల అధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్ తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికే తమ ప్రాధాన్యతని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com